



సిరిమానును అధిరోహించిన పూజారి

భక్తజన శంబరం



చదురుగుడిలో పూజలందుకున్న పోలమాంబ

- ఘనంగా సిరిమానోత్సవం
- మార్మోగిన పోలమాంబ నామస్మరణ
- మూడంచెల భద్రత మధ్య ప్రధాన ఘట్టం పూర్తి
- భారీగా తరలివచ్చిన భక్తులు
- అమ్మవారి దర్శనానికి బారులు



శంబరలో సిరిమానోత్సవం



కరుణించు.. పోలమాంబ

మక్కువ/సాలూరు రూరల్/ సాలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి)

అశేష భక్తజనులతో శంబర మురిసింది. సిరి సంబరం అంబరాన్నంటింది. అమ్మవారిని దర్శించి భక్తజనం పులకించింది. అంతటా పోలమాంబ నామస్మరణ మార్మోగింది. ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. పోలీసుల మూడంచెల భద్రత మధ్య సంప్రదాయబద్ధంగా ప్రధాన ఘట్టం ముగిసింది. సిరిమానోత్సవం అరగంట ఆలస్యంగా మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమైంది. తొలుత గ్రామ వీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. వాటికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంప్రదాయం ప్రకారం సిరిమానును జన్ని పేకాపు రామారావు అధిరోహించారు. తొలుత ఆయన్ని చదురు గుడి నుంచి సాడేపు కుటుంబీకులు భుజాలపై మోసుకొని వచ్చారు. ఆతర్వాత 36 అడుగుల సిరిమానుపై కూర్చో బెట్టారు. ఆ సమయానికి మంగళ వాయిద్యాల మధ్య సిరిమాను వద్దకు ఘటాలు వచ్చాయి. సిరిమాను, ఘటాలు ముందుగా గిరడ , కుప్పిలి, పూడి వారిళ్లకు వెళ్లగా ఆయా కుటుంబీకులు పూజలు చేశారు. అనంతరం ఘటాలు దక్షిణ దిక్కుగా, సిరిమాను తూర్పు దిక్కుగా వెళ్లాయి. అవి మళ్లీ పణుకు వీధిలో కలిశాయి. అక్కడ పొడిపిరెడ్డి కుటుంబీకులు, తీళ్ల వారి వారసులుగా అక్కాన కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను వెనకకు వచ్చి గొల్లవీధి, కొత్తవీధి మీదుగా పెద్దమ్మ గుడి వద్దకు చేరింది. అక్కడ నుంచి వెను తిరిగి నడివీధికి చేరుకొని ఆగిపోయింది. అక్కడ సాడేపు కుటుంబీలు మళ్లీ జన్ని పేకాపు రామారావును సిరిమాను నుంచి దించి భుజాలపై చదురుగుడికి తీసుకెళ్లారు. సిరిమానోత్సం మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.15 గంటలకు ముగిసింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. మరికొందరు పుసుపు కుంకుమలు, చీరలు, కోళ్లతో మొక్కులు చెల్లించుకున్నారు. ఇంకొందరు అక్కడే ఉన్న తోటల్లో వంటలు చేసుకుని సామూహికంగా భోజనాలు చేశారు. మొత్తంగా శంబర గ్రామం కళకళలాడింది. బంధువులు, స్నేహితులతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. మరోవైపు జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 689 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు.

(మరిన్ని వివరాలు 4వ పేజీలో...)



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి సంధ్యారాణి



క్యూలైన్లలో బారులుదీరిన భక్తులు

● లక్షలాది మంది రాక..

సిరిమానోత్సవాన్ని తిలకించడానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి 11 గంటల వరకు శంబరలో భక్తుల రద్దీ పెద్దగా లేదు.. మధ్యాహ్నం 12 గంటల తరువాత పెద్దసంఖ్యలో భక్తజనం రాక ఆరంభమైంది. సిరిమానోత్సవ సమయానికి పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో శంబర వీధులు జనసంద్రంగా మారాయి.

● పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

సిరిమానోత్సవం సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పోలమాంబకు పట్టువస్త్రాలు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలసి అమమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ట్రస్ట్ బోర్డు చైర్మన్ తిరుపతిరావు, ఈవో వీవీ సూర్యనారాయణ రుత్వికులు పూర్ణకుంభంతో స్వాగతం చెప్పారు. కండువా వేసి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.



పాచిపెంట పీహెచ్‌సీలో సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో

రక్తహీనత నివారణే లక్ష్యం

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

పాచిపెంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తహీనత నివారణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా రికార్డులను పరిశీలించి మందుల నిల్వలను గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పీహెచ్‌సీ ప్రాంగణాల్లో ఆకు కూరలు, కాయగూరలు పండించి గర్భిణులకు అందిస్తున్నామని తెలిపారు. 13 రోజులకొక సారి గర్భిణుల ఇళ్లకు ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్ వెళ్లి వైద్య పరీక్షలు చేయాలని సూచించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డెంగ్యూ, మలేరియా నివారణకు మలాథిన్ మందు పిచికారీ చేయిస్తున్నామని వెల్లడించారు. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సబ్ సెంటర్ల ద్వారా రోగులకు సక్రమంగా మందులు అందే విధంగా చర్యలు చేపట్టామన్నారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

పార్వతీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా మంగళ వారం ఆయన అక్కడి పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్ల, ఈవీఎంల రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్‌గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం భద్రత అధికారులకు పలు సూచనలు చేశారు. డీఆర్వో కె.హేమలత, తహసీల్దార్ వై.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదాము వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

శుభకార్యాలకు వేళాయే..

● జూన్ వరకు మంచి ముహూర్తాలు ● వివాహాల ఏర్పాట్లలో జిల్లావాసులు



పాలకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శుభ కార్యాలకు వేళయ్యింది. ఈ నెల 30 నుంచి మాఘమాసం ప్రారంభం కానుంది. మార్చి 16 వరకు మంచి ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్ల, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు తదితర శుభ కార్యాలు ఊపందుకోనున్నాయి. ఫిబ్రవరిలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25, మార్చిలో 1, 2, 6, 7, 12 , ఏప్రిల్‌లో 14, 16, 18, 19, 20, 21, 25, 29, 30, జూన్ 1, 2, 4, 7 తేదీలు శుభకార్యాలకు అనుకూలమని పండితులు చెబుతున్నారు. కాగా వివాహాలు చేయదలిచిన వారు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. పురోహితులు, కల్యాణ మండపాలు, డెకరేషన్, వంట పనివారు, వీడియో, ఫొటోగ్రాఫర్లు, బాజా భజంత్రీల వారిని బుక్ చేసుకున్నారు. ముందుస్తుగా అడ్వాన్సులు కూడా చెల్లించారు. శుభ ముహూర్తాల సందర్భంగా మరోవైపు వ్యాపారాలు కూడా జోరందుకున్నాయి. పలు వర్గాల వారికి చేతి పండా పని దొరికింది. మొత్తంగా అంతటా సందడి వాతావరణం నెలకొంది.

అన్నీ మంచి ముహూర్తాలే...

ఉత్తరాయణంలో శుభముహూర్తాలు అధికంగా ఉంటాయి. అందులో మాఘం, ఫల్గుణం, చై త్రం, వైశాఖం, జ్యేష్ఠం మాసాల్లో శుభ ముమూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సమయంలో వివాహాలు, గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, దేవతా మూర్తుల ప్రతిష్ఠలు చేసుకోవచ్చు.

- డి.లక్ష్మీ ప్రసాదశర్మ, కోటదుర్గమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు
● డ్వామా పీడీ రామచంద్రరావు
● ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల సస్పెన్షన్‌కు ఆదేశం
6లో

ఆరు లైన్ల రోడ్డుతో ఇబ్బందులు
● నిర్మాణ కంపెనీ వద్ద గిరిజనుల ఆందోళన

నేడు రాజాంలో జాబ్‌మేళా
5లో

గంజాయి వ్యాపారుల ఆస్తుల సీజ్
● రూ.1,97,62,965 విలువైన స్థిర, చరాస్తుల అటాచ్
● డీఐజీ గోపీనాథ్ జెట్టి

వేతనదారుల ఉన్నతికి చర్యలు

● స్వయం ఉపాధి లక్ష్యంగా అడుగులు ● వివరాల సేకరణలో అధికారులు

పార్వతీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఉన్నతి పథకం కింద స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణలను అందించేందుకు రంగం సిద్ధం చేసింది. వేతనదారులకు లేదా వారి కుటుంబంలో ఉన్న వారికి వివిధ రంగాల్లో తర్ఫీదు ఇచ్చి వారి ఆర్థిక బలోపేతానికి చర్యలు తీసుకోనున్నారు. 2023-24లో వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కూలీలు ఈ పథకానికి అర్హులు. టెన్త్ పూర్తయిన వేతనదారులు లేదా వారి పిల్లలకు కుటుంబ పోషణకు ఉపయోగపడే వివిధ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు ఉన్నతి పథకంలో చేరొచ్చు. విద్యార్హతను బట్టి శిక్షణను ఎంపిక చేసుకోవచ్చు. కాగా ఇప్పటికే అధికారులు వేతనదారుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. ప్రభుత్వం ఇవ్వనున్న శిక్షణను గురించి తెలియ జేస్తున్నారు. వేతనదారులు లేదా వారి పిల్లలు ఏ రంగంలో శిక్షణ పొందుతారో తెలుసుకుంటున్నారు.

90 రోజుల పాటు శిక్షణ

శిక్షణకు ఎంపికైన వేతనదారులు లేదా వారి పిల్లలకు 31 రంగాలకు సంబంధించి 215 కోర్సుల్లో 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో రోజుకు రూ.300 చొప్పున అందిం చనున్నారు. మొత్తంగా 90 రోజులకు రూ. 27 వేలు భృతిగా చెల్లించనున్నారు. కుట్టు, ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రిక్, డ్రైవింగ్, ప్లంబింగ్ తదితర రంగాల్లో శిక్షణ అందించనున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 2,08,010 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా 3,93,282 మంది వేతనదారులు ఉపాధి పనులు చేస్తున్నారు.



ఉపాధి పనుల్లో వేతనదారులు (ఫైల్)

వివరాలు సేకరిస్తున్నాం..

వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల వివరాలను సేకరిస్తున్నాం. ఇప్పటికే జిల్లా నుంచి 546 మందిని ఎంపిక చేసి స్కిల్ డెవలప్‌మెంట్ శాఖకు అప్పగించాం.

- రామచంద్రరావు, పీడీ, డ్వామా

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

● డీఆర్వో హేమలత



సమావేశంలోమాట్లాడుతున్న డీఆర్వో హేమలత

పార్వతీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి ఒకటో తేదీ నుంచి పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని డీఆర్వో కె.హేమలత ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'మన్యం'లోని 34 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. మొత్తంగా 5,126 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రతి కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకుని తిరిగి వారి ప్రాంతాలకు వెళ్లేలా ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. ప్రతి కేంద్రం వద్ద ప్రథమ చికిత్సా శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లను రోజూ పర్యవేక్షించా లన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి డి.మంజులవీణ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎటువంటి సమస్యాత్మక కేంద్రాలు లేవన్నారు. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం మేనేజర్ జగన్మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు తదితరులున్నారు.

సమస్యలు విని..
పరిష్కారానికి కదిలి..

- 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమానికి మంచి స్పందన
- ఉడా కాలనీలో భారీగా హాజరైన ప్రజలు
- ఏళ్ల తరబడి ఉన్న సమస్యల ఏకరవు
- ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే అదితి

ఆంధ్రజ్యోతి
అక్షరం అండగా..
పరిష్కారమే అజెండాగా..

(ఆంధ్రజ్యోతి బృందం)

విజయనగరంలోని ఉడా కాలనీలో గల గాంధీ పార్కు వేదికగా 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కమిషనర్ పల్లి నల్లనయ్యలు హాజరయ్యారు. స్థానిక కార్పొరేటర్ సత్యవతి, ఉడా ఫేజ్-1, 2, గౌతమి కాలనీ, కాశీ ఘాట్ కాలనీ తదితర కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని సమస్యలను వివరించారు. గాంధీ పార్కుకు ప్రహరీ నిర్మించాలని, 1994లో ఏర్పాటైన ఆ కాలనీకి మంచినీటి సరఫరాను మెరుగుపరచాలని కోరారు. కాలువలు, రోడ్లు వంటి ప్రధాన సమస్యలు, ఉడా కాలనీకి వెళ్లే రహదారిలో మందుబాబుల హడావిడి తదితర అంశాలను ప్రస్తావించారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, సీసీ కెమెరాలు పునరుద్ధరించాలని కోరారు.


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదితి, కమిషనర్ నల్లనయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కమిషనర్ నల్లనయ్య, కార్పొరేటర్ సత్యవతి తదితరులు

ప్రాధాన్య క్రమంలో పరిష్కారం..

ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం బృహత్తరమైనదన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఇటువంటి వేదికను సంస్థ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఈ వేదిక ద్వారా వచ్చే సమస్యలను దశల వారీగా, ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని ఆమె ప్రకటించారు. గాంధీ పార్కుకు ప్రహరీ, పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటి కే దీనిపై కమిషనర్ నల్లనయ్యతో చర్చించామని తెలిపారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి ప్రాధాన్య క్రమంలో ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్య సమస్య లేని నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. 2014 నుంచి 2019 వరకూ కేంద్ర మంత్రిగా అశోక్ గజపతి రాజు ఎన్నో బృహత్తర కార్యక్రమాలు చేపట్టారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నగరపాలక సంస్థకు నిధులు తెచ్చారని గుర్తు చేశారు. దీంతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మున్సి పల్ చైర్మన్‌గా ప్రసాదుల రామకృష్ణ కొన్ని నిధులను సకాలంలో వ్యయం చేయకపోవడం వల్ల వాటితో 2019 నుంచి 2024 మధ్య అభివృద్ధి కార్యక్రమాలను గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే అదితి తెలిపారు.

'ఆర్థికం' కానివి తక్షణమే ..

నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వార్తల సేకరణే కాకుండా.. ప్రజల సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియ జేసి, పరిష్కరించేందుకు 'ఆంధ్రజ్యోతి' నిర్వహిస్తున్న 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం చాలా మంచిదన్నారు. ఇటువంటి వేదికల ద్వారా సామూహికంగా అందరూ ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావనకు వస్తాయ న్నారు. ఆర్థిక పరం కానివి వెంటనే పరిష్కరిస్తామని, ఆర్థికపరమైనవి నిబంధనల ప్రకారం కౌన్సిల్ అజెండాలో ఉంచి... పరిష్కరించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఉడా కాలనీకి సంబంధించి న సమస్యలపై ఎమ్మెల్యే అదితి గజప తిరాజు కొద్ది రోజుల కిందటే సమీక్ష చేశారన్నారు. వీటిలో తొలి ప్రాధాన్యంగా పార్కు చుట్టూ ప్రహరీ, ఓపెన్ జిమ్‌కు ప్రతిపాదనలు సిద్ధమవు తున్నాయని తెలిపారు. తాగునీరు, మురుగునీటి సమస్యలు, కుక్కల బెడద, ఆస్తి పన్ను, రోడ్లు, కాలువలు, విద్యుత్ తదితర సమస్యలు నగరపాలక సంస్థ పరిధిలోకి వస్తాయన్నారు. వాటిని ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామ న్నారు.


కమిషనర్ నల్లనయ్య

సమస్యలపై చర్చించా..

43వ డివిజన్ కార్పొరేటర్ సత్యవతి మాట్లాడుతూ.. స్థానిక సమస్యలను ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు చెప్పారు. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని ఈ డివిజన్‌లో నిర్వహించడం హర్షణీయ మన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రమేష్, నాయుడు, పాపినాయుడు, సీతామహాలక్ష్మి, ప్రజాప్రతినిధులు లక్ష్మణరావు, భాస్కర్, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు పార్కులోని గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే అదితి గజపతి రాజు పూల మాల వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు బయపరెడ్డి, అనంత్, బోని శ్రీనివాసరావు, బూరాడ శ్రీనివాసరావు, కృష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ప్రజలు

మంచి కార్యక్రమం..



'ఆంధ్రజ్యోతి' కేవలం సమాచార రంగంలోనే కాకుండా... హిందూ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడే విధంగా ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తోంది. తాజాగా 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' అనే బృహత్తర కార్యక్రమం చేప ట్టింది. ప్రజల సమస్యలు, ముఖ్యంగా ఆయా ప్రాంతాల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా.. వాటిని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఈ వేదిక ద్వారా తీసుకువెళ్లడం మంచి పరిణామం. ఇటువంటి మంచి కార్యక్రమా లకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. భవిష్యత్తులో ఇటువంటి మంచి కార్యక్రమాలు 'ఆంధ్రజ్యోతి' నుంచి మరిన్ని రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

-లక్ష్మణరావు

పార్కును అభివృద్ధి చేయాలి..



ఆహ్లాదాన్ని పంచే ఉద్యానవనం (పార్కు)లో కనీస అభివృద్ధి లేక కాలనీవాసులం ఇబ్బందులు పడుతున్నాం. కాలనీ ఏర్పాటైన తొలినాళ్లలో ఫలసాయ మొక్కలు నాటి... స్వయంగా అభివృద్ధి చేసుకున్నాం. కార్పొరేషన్ కనీస సౌకర్యాలు కల్పించాలి.

-డి.రమేష్, విశ్రాంత ఉద్యోగి

30 ఏళ్లుగా సమస్యలు ఉన్నాయి..



కాలనీ ఏర్పాటై 30 ఏళ్ల గడిచినా సమస్యలు అలాగే ఉన్నాయి. నాడు ఏర్పాటు చేసిన మురుగునీటి కాలువలు ఇప్పటి జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ లేక ఆకతాయిలకు... అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ హయాంలో రోడ్ల అభివృద్ధి జరిగింది. ఆ తరువాత ఇప్పటి వరకు ఎవరూ చేసిందేమీ లేదు.

-వి.కృష్ణమూర్తి, స్థానికుడు

నీటి సరఫరా తక్కువగా ఉంది..



మూడు దశాబ్దాల కిందట తక్కువ సామర్థ్యంతో వాటర్ ట్యాంకు నిర్మించారు. దాని సామర్థ్యం సరి పోకపోవడంతో వందలాది కుటుంబాలకు సరిపడా నీరు సరఫరా కావడం లేదు. కాలనీలో బోరు బావులు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలి.

-రంగాచార్యులు, విశ్రాంత ప్రిన్సిపాల్

కాలువలు కప్పేస్తున్నారు..



కాలనీలో అనేక మంది కార్లు, మోటారు బైకుల షెడ్లు కోసం మురుగునీటి కాలువలను మూసేస్తున్నారు. దీంతో కాలువలు మూసుకుపోతున్నాయి. వారిపై చర్యలు తీసుకోవాలి. ఇళ్లలో చెత్తను రోడ్లపై వేసేస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చెత్త వేసిన వారిని గుర్తించి, వారికి అపరాధ రుసుం విధించాలి.

-జి.రాధాకుమారి

రోడ్ల ఆక్రమణతో ఇబ్బందులు..



డివిజన్ పరిధిలోని అబ్దుల్‌కలాం విగ్రహం జంక్షన్ నుంచి పాల్ నగర్ వరకు రోడ్ల విస్తరణతో ప్రజలకు మేలు జరగలేదు. చిరు వ్యాపారులు, రోడ్డు పక్కన దుకాణాదారులు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. అబ్దుల్ కలాం విగ్రహ కూడలిలో గతంలో సీసీ కెమెరాలు ఉండేవి. వాటిని పునరుద్ధరించాలి. గౌతమీనగర్ పార్కుకు వచ్చే రోడ్డు మరమ్మతులకు గురై ఇబ్బందులు పడుతున్నాం. వాటికి మరమ్మతులు చేపట్టాలి.

-వెంకటరావు, గౌతమీనగర్

బోరుబావికి మరమ్మతులు చేపట్టాలి..



కాలనీలో ఉన్న అతిపెద్ద పార్కులో బోరుబావి మరమ్మతులకు గురై నెలలు గడిచిపోయింది. దీనికి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలి. చెత్తను స్థానికులు రోడ్లపై పడేయకుండా అధికారులు అవగాహన కల్పించి, చర్యలు తీసుకోవాలి.

-సరిత, ఫేజ్-2

వీధి కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి..



కాలనీ అంతా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్డుపై నడిచి వెళ్లేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

-సీతాకామేశ్వరి, ఉడా కాలనీ ఫేజ్-3

ఆసుపత్రి వ్యర్థాలతో అవస్థలు..



కాలనీకి ఆనుకొని జిల్లా కేంద్రాసుపత్రి ఉండటంతో అక్కడి నుంచి వచ్చే వ్యర్థాలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. మలమూత్రాలు, మెడికల్ వ్యర్థాలతో వచ్చే దుర్గంధంతో అనారోగ్యం బారిన పడుతున్నాం. అలాగే కాలనీ శివారున ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. ఆ ప్రదేశాన్ని బహిర్భూమిగా వినియోగిస్తుండడంతో అవస్థలు పడుతున్నాం.

-పిన్నింటి జనార్దన రావు

పార్కు నిర్వహణకు గదిని నిర్మించాలి



పార్కు నిర్వహణ అధ్వానంగా ఉంది. ప్రత్యేకంగా ఒక గది మంజూరు చేస్తే పరికరాలు భద్రపరుచుకోవచ్చు. తద్వారా స్థానికులు వాటిని ఉపయోగించి పార్కును అభివృద్ధి చేసుకుంటారు. పార్కులో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. తరచూ అధికారులు పర్యటనలు చేస్తే సమస్యలు వారికి తెలుస్తాయి.

-హెచ్.భైరాగి, విశ్రాంత అధ్యాపకులు

రోడ్డు మంజూరు చేయాలి..



ఫేజ్-1లో ఉన్న గృహ సముదాయాలకు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నాం. వృద్ధులు, చిన్నారులు గోతులతో నిండి ఉన్న మట్టి రోడ్డులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే అనేక గృహ సముదాయాలకు తాగునీటి సౌకర్యం లేదు.

-కె.గీతాంజలి, ఫేజ్-1

భవనం మంజూరు చేయాలి



కాలనీలో 35 మహిళా స్వయం శక్తి సంఘాలు ఉన్నాయి. వీటి సమావేశాల నిర్వహణకు భవనం మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. స్వయంశక్తి సంఘాలకు ఉమ్మడిగా చెత్తశుద్ధి (రీసైక్లింగ్) యూనిట్ మంజూరు చేస్తే ఆదాయ వనరుగా మారుతుంది.

-సంగీత, ఉడా కాలనీ

పన్నులు విధిస్తే మంచిది..



డివిజన్ పరిధిలో అనేక కొత్త నివాస గృహాలు, నివాస సముదాయాలు నిర్మిస్తున్నారు. సుమారు 1000 ఇళ్లకు నేటికీ పన్నులు విధించలేదు. వాటికి పన్నులు విధిస్తే నగరపాలక సంస్థకు ఆదాయం చేకూరు తుంది. ఖాళీ స్థలాల్లో తుప్పలు పెరిగిపోయాయి. వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

-మంచాల శివాని, మాజీ కౌన్సిలర్

వైభవంగా సిరిమానోత్సవం

- భక్తులతో కిక్కిరిసిన శంబర
- పోలీసు సేవలు భేష్


అమ్మవారి ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

మక్కువ/సాలూరు రూరల్/సాలూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ సిరిమానోత్సవం విజయవంతంగా ముగిసింది. శంబర గ్రామం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. భద్రత కోసం 689 మంది సిబ్బందిని నియోగించారు. జాతర సందర్భంగా ఏఎస్పీలు దిలీప్ కిరణ్, అంకిత మహావీర్ సురానా, సాలూరు సీఐలు పి.రామకృష్ణ, అప్పలనాయుడు ఉదయం నుంచే గ్రామంలో తిరుగుతూ పోలీసు సిబ్బందికి సూచనలు అందించారు. సిరిమాను తిరిగే సమయంలో రోప్ పార్టీతో బందోబస్తు నిర్వహించారు. డ్రోన్ కెమెరా, బాడీవేర్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించారు.

ఏర్పాట్లపై సంతృప్తి..

శంబర సిరిమానోత్సవం సందర్భంగా చేసిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా అమ్మవారి దర్శనమయ్యే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవడం ఫలితమిచ్చింది. వృద్ధులు, దివ్యాంగులకు పోలీసు సేవాదళ్ వాహనం ద్వారా సత్వర దర్శనం ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్నవారికి తాగునీరు, ఉచిత ప్రసాదం, చిన్నారులకు ఉచితంగా పాలు పంపిణీ చేశారు. జాతరలో సాంస్కృతిక, నేల వేషాలు భక్తులను అలరించాయి. పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం, శ్రీకాకుళం డిపోల నుంచి వంద బస్సులు నడిపారు. ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే మార్గం, బయటకు వెళ్లి గ్రామానికి చేరుకునే మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యేలు ఆర్పీ భంజ్‌దేవ్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్యశాఖ సేవలు..

వనంగుడి, చదురుగుడికి వెళ్లే మార్గాలతో పాటు గ్రామంలోని మరో మూడు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆక్సిజన్ సిలిండర్, 108 వాహనాలు, ఫీడర్ అంబులెన్స్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, మందులు, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు.


గోముఖి నదీ తీరాన మొక్కుబడులు చెల్లిస్తున్న భక్తులు

డ్రోన్‌తో నిఘా..

సిరిమానోత్సవంలో డ్రోన్ కెమెరాతో నిఘా వేశారు. సిరిమాను వెళ్లే ప్రాంతంలో డ్రోన్లు ఆకాశంలో ఎగిరాయి. వాటిని పలువురు ఆసక్తిగా తిలకించారు. దేవదాయశాఖ సైతం ఒక డ్రోన్ కెమెరాను వినియోగించింది.

గోడ కూలి ముగ్గురికి గాయాలు..

సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు కొంతమంది భక్తులు గోడ ఎక్కారు. అది కూలడంతో ముగ్గురు గాయపడ్డారు. శంబరలో పూడి వెంకటరమణ ఇంటి వద్దకు సిరిమాను రాగా.. దానిపై ఉన్న జన్ని పేకాపు రామారావు కాలిని తాకడానికి అక్కడి పిట్టగోడపైకి భక్తులందరూ ఒకేసారి ఎక్కారు. దీంతో గోడ కూలిపోయింది. ఈ ఘటనలో శంబరకు చెందిన పూడి దాలినాయుడు, గజపతినగరానికి చెందిన పొందూరు జగదీష్, కందులపథానికి చెందిన ఎ.రామకృష్ణ గాయపడ్డారు. వారికి చికిత్స చేసి పంపించారు.


డ్రోన్ కెమెరా

అందరి సహకారంతో...

- ఎస్పీ మాధవరెడ్డి

సాలూరు రూరల్/మక్కువ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో శంబర పోలమాంబ సిరిమానోత్సవం ప్రశాంతంగా ముగిసిందని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. సిరిమానోత్సవం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం ఆయన శంబరలో భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్నారు. కమాండ్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా కార్యక్రమాన్ని పరిశీలించారు. సిరిమానోత్సవం ముగియడంతో ప్రధాన కూడళ్లలో బారికేడ్లు తొలగించాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏఎస్పీ దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ అంకిత మహావీర్ సురానా పర్యవేక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది అన్ని శాఖల సమన్వయంతో సిరిమానోత్సవం కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు.


దర్శనానికి భక్తుల బారులు


శంబరలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

గంజాయి వ్యాపారుల ఆస్తుల సీజ్

- రూ.1,97,62,965 విలువైన స్థిర, చరాస్తుల అటాచ్
- డీఐజీ గోపీనాథ్ జెట్టి



విజయనగరం క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యాపారం చేస్తున్న వారి ఆస్తులను సీజ్ చేసినట్టు డీఐజీ గోపీనాథ్ జెట్టి మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి కేసులో అరెస్టైన సీహెచ్.ఉమామహేశ్వరరావుకు చెందిన రూ.1,97,62,965 విలువైన స్థిర, చరాస్తులను చట్ట పరిధిలో అటాచ్ చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారన్నారు. విశాఖలో నివాసం ఉంటున్న ఉమమహేశ్వరరావు అలియాస్ హన్సేన్, అలియాస్ పుతిన్‌కు చెందిన ఆస్తులను చట్ట ప్రకారం అటాచ్ చేశామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

శృంగవరపుకోట: గంజాయిపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఇందులో భాగంగా పట్టణాలు, గ్రామాల్లో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్న వారిపై కొద్ది రోజులుగా జిల్లా పోలీసులు నిఘా పెంచారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు సోమవారం రాత్రి 8 గంటల సమయం నుంచి విజయనగరం, గంట్యాడ మండలం తాటిపూడి, ఎస్.కోట మండలం బొడ్డవర, ముషిడిపల్లి పంచాయతీలో కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న అలూరి సీతారామరాజు జిల్లా అరుకు ప్రాంతానికి చెందిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్టు తెలుస్తోంది.

వినతులు త్వరగా పరిష్కరించండి

విజయనగరం కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో నమోదైన వినతులను త్వరగా పరిష్కరించాలని జేసీ సేతు మాధవన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీజీఆర్ఎస్ రెవెన్యూ, రీ సర్వే వినతులు, ఫ్రీ హోల్డ్ భూములు, పీవోఎల్ఆర్ తదితర రెవెన్యూ అంశాలపై మండలాలు వారీగా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో శ్రీనివాస మూర్తి, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళీ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య తనిఖీలపై టాస్క్‌ఫోర్స్ ఆరా

రేగిడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బూరాడ పీహెచ్‌సీ పరిధిలో అంబాడ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలపై జిల్లా వైద్య విభాగం టాస్క్‌ఫోర్స్ బృందం మంగళవారం ఆరా తీసింది. అంబాడ పాఠశాలలో పిల్లలకు హెచ్‌బీ, ఇతర ఆరోగ్య తనిఖీలు, గర్భిణులు, చిన్నారులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎం పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, ఆశా కార్యకర్తల పనితీరును సమీక్షించారు. టాస్క్‌ఫోర్స్ బృందంలో డీపీహెచ్ఎన్ సత్యవతి, గణాంకాధికారి ధర్మారావు, డీపీవో రామానుజులనాయుడు, ఎంఐఎస్ శ్రీనివాస్ ఉన్నారు.

ఐసీడీఎస్‌ను క్రమబద్ధీకరించండి

గజపతినగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను క్రమబద్ధీకరించాలని సెక్టార్ యూనియన్ నాయకులు సౌజన్య, సూర్యకుమారి, నారాయణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మరుపల్లి సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రపతికి వ్యక్తిగత దరఖాస్తులు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్‌కు 50 ఏళ్లు పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో ఐసీఈడీఎస్‌ను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐ.సన్యాసమ్మ, నాగమణి, జ్యోతి, టి.సన్యాసమ్మ, అన్నపూర్ణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: ఐసీడీఎస్‌ను క్రమబద్ధీకరించాలని, కనీసం వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యక్తిగత దరఖాస్తులను పోస్టులో పంపిస్తున్నారని సంఘం నాయకురాలు మంగవేణి తెలిపారు. నెల్లిమర్ల సెక్టార్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో దరఖాస్తు పంపే ప్రక్రియను చేపట్టామన్నారు. ఐసీడీఎస్‌కు కేటాయింపులు పెంచాలని వారు కోరారు.

నేడు రాజాంలో జాబ్‌మేళా

రాజాం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 29న బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐటీఐ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించనున్నాయని ఏపీఎస్ ఎస్‌డీసీ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 ఏళ్లలోపు యువత మేళాకు హాజరుకావచ్చన్నారు.

సంగీత కళాశాలలో గాత్ర కచేరీ

విజయనగరం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహారాజా సంగీత నృత్య కళాశాలలో మంగళవారం త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి, రాయని శారద గాత్ర సంగీత కచేరీ నిర్వహించారు. హంస ధ్వనిలో అభిష్ట వరదా కీర్తనతో ప్రారంభించి మలయమారుతంలో మనసా ఎటు లోర్తునో.. బహుదారిలో బ్రోవ భారమా.. మధ్యంగ తాళం ప్రధాన అంశంగా గానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. కళాకారులను ప్రిన్సిపాల్ శాస్త్రి సత్కరించారు.

సదుపాయాలు కల్పించండి

జామి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగి దళితవాడలో కనీస సదుపాయాలు కల్పించాలని సీపీఎం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం దళితులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు తదితరులు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు.

నేత్ర చికిత్సలకు తరలింపు

కొత్తవలస, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలోని 30 మందిని నేత్ర చికిత్సలకు విజయనగరంలోని పుష్పగిరి ఆసుపత్రికి తరలించామని వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఆప్తమాలిక్ అధికారి ఇటీవల సచివాలయాల పరిధిలో నేత్ర పరీక్షలను నిర్వహించారన్నారు.

ఉపాధి పనులపై 31న ప్రజావేదిక

చీపురుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ బృందం గుర్తించిన అంశాలపై ఈ నెల 31 ప్రజావేదికను నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఇప్పలవలస సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

క్రీడా పోటీలకు ఇద్దరు ఉద్యోగులు

సంతకవిటి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఛండీఘర్‌లో నిర్వహించనున్న ఆల్ ఇండియా ఉద్యోగుల క్రీడా పోటీలకు సంతకవిటి మండలం నుంచి ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. మండలంలో మామిడిపల్లి గ్రామానికి చెందిన కె.సూర్యనారాయణ, అలాగే తమరాం గ్రామానికి చెందిన డి.యశోద ఉద్యోగుల క్రీడలకు హాజరుకానున్నారు.

కళా సోదరుడి అంత్యక్రియలు నేడు

రేగిడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు సోదరుడు కిమిడి సత్యనారాయణ గుండెపోటుతో విశాఖలో సోమవారం రాత్రి మృతి చెందిన నేపథ్యంలో ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామం రేగిడికి తీసుకువచ్చారు. మంగళవారం ప్రజల సందర్శనార్థం ఉంచారు. బుధవారం ఉదయం 8 గంటలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు కళా కుటుంబీకులు ఏర్పాట్లు చేశారు. సత్యనారాయణను కడసారి చూసేందుకు రేగిడి, రాజాం, వంగర, సంతకవిటి, ఎచ్చెర్ల, చీపురుపల్లి, జి.సిగడాం నుంచి అభిమానులు తరలి వచ్చారు. పరామర్శించిన వారిలో చీపురుపల్లి మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు, వివిధ పార్టీలకు చెందిన నేతలు, అధికారులు ఉన్నారు.

కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాలు

చీపురుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో రెండు మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికుల కోసం ప్రభుత్వం కేటాయించిందని ఎక్సైజ్ సీఐ సిహెచ్.చక్రవర్తి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా గణాంకాల ప్రకారం గరివిడిలో సెగిడి కులానికి ఒక దుకాణం, మెరకముడిదాంలో యాత కులానికి ఒక దుకాణం కేటాయించామన్నారు. ఇందుకు ఈనెల 27న నోటిఫికేషన్ విడుదల అయ్యిందని, అర్హతలు గలవారు ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లైసెన్స్ రుసుముగా తొలి ఏడాది రూ.21,66,667, రెండో ఏడాది రూ.35.75 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 7న కలెక్టరేట్‌లో డ్రా తీస్తామన్నారు. సమావేశంలో ఎస్ఐ గిరీష్ పాల్గొన్నారు.

●గజపతినగరం: గజపతినగరం మండలంలో కల్లుగీత కార్మికులకు ఒక మద్యం దుకాణాన్ని ప్రభుత్వం కేటాయించిందని ఎక్సైజ్ సీఐ జనార్దనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యాత కులస్తులు మద్యం దుకాణానికి ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

●నెల్లిమర్ల: నెల్లిమర్ల మండలానికి కొత్తగా ఓ మద్యం దుకాణం మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. యాత కులానికి ఈ దుకాణాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

● కొత్తవలస: కొత్తవలస మండలంలో ఒక మద్యం దుకాణాన్ని యాత సామాజిక వర్గానికి కేటాయించినట్టు కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. మండలంలోని గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే వీలుందన్నారు.

●భోగాపురం: భోగాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీత కులాల వారికి రెండు మద్యం షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రొహిబేషన్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు సంబంధించి సెగిడి ఉప కులానికి వారికి మద్యం దుకాణాలను కేటాయించడం జరిగిందన్నారు.

పుణ్యగిరి జాతర ఖర్చులకు ఆమోదం



మాట్లాడుతున్న సర్పంచ్ సంతోషికుమారి

శృంగవరపుకోట జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పంచాయతీ పాలక మండలి సభ్యులు దారికొచ్చారు. ఇంతవరకు వ్యతిరేకించిన పుణ్యగిరి మహాశివరాత్రి జాతర ఖర్చులు, గృహ నిర్మాణాల అనుమతులకు ఆమోదం తెలిపారు. మంగళవారం సర్పంచ్ గనివాడ సంతోషికుమారి అధ్యక్షతన పంచాయతీ ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా పుణ్యగిరి కొండకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో సదుపాయాల కల్పనకు అవసరమయ్యే ఖర్చుల ఆమోదం కోసం రెండుసార్లు పాలక మండలి సమావేశాలను ఈవో నిర్వహించారు. రెండుసార్లూ కోరం లేకపోవడంతో సమావేశాలు వాయిదా పడ్డాయి. తుదకు మంగళవారం నిర్వహించిన సమావేశంలో పుణ్యగిరిలో శివరాత్రి జాతర సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, విద్యుత్, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్వహణకు పంచాయతీ సాధారణ నిధులను వెచ్చింపునకు సభ్యులు అంగీకరించారు. అలాగే గృహ నిర్మాణాల అనుమతుల మంజూరును మూడు సమావేశాల్లోను వ్యతిరేకించారు. 20 గృహ నిర్మాణ అనుమతులను అధికారులు సమావేశంలో సభ్యులకు చదవి వినిపించారు. వార్డులు వారీగా సభ్యుల అనుమతితో 17 గృహ నిర్మాణాల అనుమతులు మంజూరు సభ్యులు ఆమోదం తెలిపారు. మిగిలిన మూడు గృహ నిర్మాణాల అనుమతులకు ఆయా వార్డు సభ్యులు హజరుకాకపోవడంతో ఆపినట్టు ఈవో అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన ఓ చానల్ రిపోర్టర్ ప్రకాశ్‌శర్మకు పాలక మండలి నివాళులర్పించారు.

వందనకు అభినందనలు



వందనను అభినందిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్ ఫిజియోథెరపి కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఆర్.వందన చత్తీస్‌గడ్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వందనను మిమ్స్ వైద్య కళాశాల ఛైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్‌వర్మలతో పాటు డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రఘురామ్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఫిజియెథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, ఏవో గణేష్ అభినందించారు. పీడీ కె.కళావెంకటరావు, కోచ్ మహేష్, వందన తల్లిదండ్రులు లక్ష్మీగాయత్రి, శంకరరావులను ప్రశంసించారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

రాజాం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణంలో త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నవదుర్గ ఆలయం నుంచి బొబ్బిలి రోడ్డులోని వస్త్రపురి కాలనీ టీటీడీ కల్యాణమండపం వరకు త్యాగరాజ కీర్తనలతో ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్ర మంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహిత పెంకి చైతన్యకుమార్, నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం ప్రతినిధులు రాయణ, గణేష్, పసుపురెడ్డి వెంకటరమణ, కార్యదర్శి కొండేటి దుర్గారావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో మేలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి

విజయనగరం క్రైం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తుల ద్వారా కేసులు సులభంగా పరిష్కారం చేయవచ్చునని జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయికళ్యాణ చక్రవర్తి అన్నారు. 40 గంటల మిడియేషన్ కార్యక్రమంలో రెండు రోజుల శిక్షణలో ఉన్న న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మంగళవారం మాట్లాడారు. మధ్యర్తిత్వంలోని మెలకువలను నేర్చుకోవడం ద్వారా కేసులను సులభంగా పరిష్కరించవచ్చునన్నారు. ఈ శిక్షణ అందుకు ఉపయోగపడుతుందన్నారు. వ్యాజ్యాలను మానవతా దృక్పథంతో పరిశీలించి ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని న్యాయవాదులకు సూచించారు. దీంతో ఉభయ పార్టీలకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా సదన్ సంస్థ కార్యదర్శి టి.వి.రాజేశ్‌కుమార్, ఉమ్మడి జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లిమర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈవీఎం గోదాంను కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్ మంగళవారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లు, సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరా ఫీడ్‌ను 15 రోజులకు ఒకసారి భద్రపరచాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో దాట్ల కీర్తి, తహసీల్దార్ బి.సుదర్శనరావు, సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు తెలిపారు.

జగన్ సర్కార్‌తో పర్యాటకం నాశనం



మాట్లాడుతున్న పర్యాటకశాఖ బోర్డు డైరెక్టర్లు

శృంగవరపుకోట రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండపై నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వప్రయోజనాల కోసం రూ.500 కోట్లతో నిర్మించిన ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలనే దానిపై కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ డైరెక్టర్లు వాసిరెడ్డి రాంబాబు, గంట స్వరూప, షేక్‌ముంతాజ్, రమేష్, ఇందుకూరి సుధారాజు అన్నారు. మంగళవారం అరుకు పర్యటనకు వెళ్తున్న రాష్ట్ర పర్యాటకశాఖ డైరెక్టర్లు బొడ్డవరలో విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి పర్యాటక శాఖను పూర్తిగా నాశనం చేశారన్నారు. పర్యాటక శాఖలో జవసత్వాలు నింపేందుకు పర్యాటక శాఖ ఛైర్మన్ బాలాజీ ఆధ్వర్యంలో నడుం బిగించామన్నారు. వచ్చే నెల 15న పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో పర్యాటకానికి కొత్తసొబగులు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

క్రీడా వర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తా



రామ్మూర్తి విగ్రహం ఎదుట నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

విజయనగరం టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేలా ప్రభుత్వాన్ని కోరుతానని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. మల్లయోధుడు కోడి రామ్మూర్తి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని విజయనగరం వ్యాయామ సమాజం ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా కోడి రామమూర్తి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటి రోజుల్లో కోడి రామ్మూర్తి ఎన్నో బల ప్రదర్శనలు ఇచ్చి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. వ్యాయామకారులు పెద్దిరెడ్డి లక్ష్మీనారాయణ శిక్షణలో ఎంతోమంది క్రీడాకారులు శిక్షణ పొందడం ఆనందంగా ఉందన్నారు. కోడి రామ్మూర్తి ప్రదర్శనలు స్ఫూర్తిగా తీసుకుని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బి.ప్రవీణ్ రన్నింగ్‌లో ఉన్న కారును ఆపే ప్రదర్శన, అతివేగంతో రెండు వ్యతిరేక దిశలో ఉన్న రెండు మోటారు బైక్‌లను ఆపిన ధన్‌రాజ్‌ల ప్రదర్శనను ఆమె కొనియాడారు. అనంతరం వారిని సత్కరించారు. జాతీయ బాక్సింగ్ క్రీడాకారులు సంతోష్, ఏషియన్ సబ్ జూనియర్ బంగారు పతక విజేత ఉష, కామన్‌వెల్త్ ఛాంపియన్ సంతోషిలను సత్కరించారు. అనంతరం కోడి రామ్మూర్తి చిత్రపటంతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారులు కత్తిసాము ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త పల్లంట్ల రామారావు, మాజీ కౌన్సిలర్ పెనుమజ్జి విజయలక్ష్మి, విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.

'అనర్హులకు మినీ గోకులాలు'

గుర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనర్హులకు మినీ గోకులాలు ఇవ్వడంపై అధికారుల తీరుపై జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల సమక్షంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపూడి, చింతపల్లిపేట, బూర్లుపేట, కొండగండ్రేడు, జమ్ము, జమ్ముపేట సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మినీ గోకులాల మంజూరుపై విమర్శలు చేశారు. అర్హుల దరఖాస్తులను పట్టించుకోకుండా ఎటువంటి అర్హతలేని రైతుకు మినీ గోకులం అందజేశారని ఆరోపించారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘ సభ్యులను తమ ఇష్టాను సారంగా తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌ల తీర్మానం లేకుండా పనులు చేయడంపై మండిపడ్డారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతి రావు, చెన్నారావు, ఎంపీడీవో శేష ఉన్నారు.

రెండు రోజుల్లో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం



తాత్కాలిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఇదే..

విజయనగరం కలెక్టరేట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పట్టణంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు అంతా సిద్ధమైంది. రెండు రోజుల్లో కార్యాలయాన్ని ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్,"సిబ్బందిని నియమించే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. దీంతో రూరల్, అర్బన్ తహశీల్దార్ కార్యాలయాలు వేర్వేరుగా ఉంటాయి. విజయనగరం పట్టణంలో జనాభా పెరగడంతో మున్సిపల్ కార్పొరేషన్‌గా ప్రభుత్వం మార్పు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా అర్బన్ తహసీల్దార్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిబంధన ఉంది. అర్బన్ కార్యాలయం ఏర్పాటుకు 2022లో ప్రభుత్వం జీవో ఇచ్చింది. అప్పటి నుంచి కార్యాలయం ఏర్పాటు కాలేదు. ఏడాది క్రితం కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కానీ అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం హయంలో కార్యాలయం ఏర్పాటుకు అంతా సిద్ధమైంది. పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట మీసేవ కేంద్రంలో తాత్కాలికంగా అర్బన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

పోక్సో కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

బొండపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి మంగళవారం సాయంత్రం తీర్పు వెలువరించారని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2021 సంవత్సరంలో బొండపల్లి పోలీసుస్టేషన్‌లో బొండపల్లి గ్రామానికి చెందిన గొండేల చంద్రయ్య అలియాస్ శ్రీనివాస్‌పై పోక్సో కేసు నమోదైనట్టు తెలిపారు. మైనర్ బాలిక ఆడుకుంటుండగా చంద్రయ్య బలవంతంగా మామిడి తోటలోకి తీసుకువెళ్లి అత్యాచారం చెయ్యడానికి ప్రయత్నించాడన్నారు. బాలిక కేకలు వేయడంతో పరారైనట్టు తెలిపారు. బాలిక తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అప్పటి ఎస్ఐ వాసుదేవరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు దర్యాప్తు నిర్వహించి నిందితుడిపై అభియోగపత్రాలు దాఖలు చేశారన్నారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఖజానారావు వాదనలు వినిపించారన్నారు. నేరం రుజువు కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేశారన్నారు. ఈ సందర్భంగా గజపతినగరం సీఐ .రమణ, బొండపల్లి ఎస్ఐ యు.మహేష్‌తో పాటు హెచ్‌సీలు ప్రకాశరావు, రామకృష్ణలను అభినందిస్తున్నట్టు తెలిపారు.

చీటీల మోసం కేసులో ముగ్గురికి జైలు

గుర్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చీటీల మోసం చేసిన కేసులో ముగ్గురికి ఆరు నెలల జైలుతో పాటు రూ.500 చొప్పున చీపురుపల్లి జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ శిక్ష విధించినట్టు ఎస్ఐ పి.నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో గుర్ల గ్రామానికి చెందిన పతివాడ ప్రకాశరావుతో పాటు మరి కొంతమంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరాడ గౌరి, కోరాడ రమణ, కోరాడ అప్పయ్యమ్మపై కేసు నమోదైందన్నారు. నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ వారికి శిక్ష ఖరారు చేశారన్నారు.

ఇరువర్గాలపై కొట్లాట కేసుల నమోదు

బొండపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కొట్లాట ఘటనలో ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ యు.మహేష్ మంగళవారం తెలిపారు. గొల్లలపేట గ్రామానికి చెందిన పీతల చంటిబాబుపై బొండపల్లి గ్రామానికి చెందిన బొండపల్లి ఆదినారాయణ దాడి చేసినట్టు పీతల సత్యం ఫిర్యాదు చేయగా, తన కుమారుడుపై పీతల చంటిబాబు దాడి చేశారని బొండపల్లి అప్పలసూర్యం ఫిర్యాదు ఇచ్చారన్నారు, దాంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని తెలిపారు

247 మద్యం సీసాల స్వాధీనం

గజపతినగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో 247 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. గజపతినగరం, ముచ్చర్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేశామన్నారు. దాడిలో మద్యంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

మహిళ అదృశ్యం

భోగాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలం గుడివాడ గ్రామానికి చెందిన పిల్లి స్వాతి అదృశ్యమైనట్లు ఆమె భర్త పిల్లి అప్పలరాజు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారని హెచ్‌సీ శ్రీను మంగళవారం తెలిపారు. స్వాతి ఈనెల 16న ఇంటి నుంచి వెళ్లిపోయిందని, ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేక పోవడంతో ఫిర్యాదు చేశారన్నారు. ఆమె గతంలో కూడా ఇలాగే ఇల్లు విడిచిపెట్టి వెళ్లి తిరిగి వచ్చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారని హెచ్‌సీ తెలిపారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

శృంగవరపుకోట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండ పంచాయతీ కార్యదర్శి పీవీడీ సురేంద్రకుమార్ (52) సోమవారం రాత్రి విజయనగరంలోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. సురేంద్రకుమార్ మృతదేహాన్ని ఎంపీడీవో నాయుడు, పంచాయతీ కార్యదర్శులు మండల సంఘ అధ్యక్షుడు జగదీశ్ సందర్శించి నివాళులర్పించారు.

వెటర్నరీ విద్యార్థుల ఆందోళన

గరివిడి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గరివిడిలో పశువైద్య కళాశాల విద్యార్థులు మంగళవారం తరగతులు బహిష్కరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కళాశాల ముందు ఆందోళనకు దిగారు. కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న తమకు వీసీఐ అనుమతులు లేవని దానివల్ల ఇంటర్న్‌షిప్‌కు వెళ్లే అవకాశం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి వీసీఐ అనుమతులు వస్తాయని చెబుతున్నప్పటికీ ఇంతవరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కళాశాలలో పూర్తిస్థాయి వసతులు లేవన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావు స్పందించి ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కళాశాలలో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్య తీసుకువెళ్లి సమస్య పరిష్కారిస్తానని పేర్కొన్నారు.

రోడ్డు కోసం రెండోరోజు వంటావార్పు

వేపాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆతవ రోడ్డు పనులు పూర్తి చేయాలంటూ గ్రామస్థులు రెండోరోజూ మంగళవారం ఆందోళన కొనసాగించారు. అధికారులతో చర్చలు విఫలం కావడంతో వంటావార్పుతో ఆందోళన చేశారు. మండలంలోని పలువురు నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు మద్దతుగా నిలిచారు. ఆందోళనలో సర్పంచ్ గొంప వేమననాయుడు, గ్రామ పెద్దలు దేబారికి కిరణ్, కెర్రి దేముడు, ఆతవ నాగరాజు, గొంప సన్నిబాబు, గొంప అవతారం, దొగ్గ సాంబ, చింతాడ దేముడు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా రమణ

గజపతినగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శుల మండల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ సుగుణాకరరావు అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో సంఘ అధ్యక్షుడిగా మంత్రి రమణ, ఉపాధ్యక్షుడిగా కర్రి పార్దు నాయుడు, కార్యదర్శిగా రోనీలీనా, సహ కార్యదర్శిగా బెహర రమ్య, కోశాధికారి గా గంగుల తాతారావు ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎంపీడీవో బి.కల్యాణి అభినందించారు.

వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌కు చాదర్ సమర్పణ

విజయనగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి దూత హజరత్ బాబా ఖాదర్ వలీ 66వ మహాసూఫీ సుగంధ మహోత్సవాలు వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో బాబామెట్టలో జరగనున్నాయి. ఈ మహోత్సవాలకు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ జనాబ్ అబ్దుల్ అజీజ్‌ను ఆహ్వానిస్తూ ఖాదర్‌బాబా దర్గా దర్బార్ షరీఫ్ మూతవల్లీ, ఎండీ ఖలుల్లా షరీఫ్ మంగళవారం విజయవాడలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ సంప్రదాయాన్ని గుర్తుచేస్తూ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌కు చాదర్‌ను సమర్పించారు. కార్యక్రమంలో బోర్డు డైరెక్టరు జనాబాఖాజా, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పీఎం ఇంటర్న్‌షిప్ నమోదు

విజయనగరం రింగురోడ్డు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం పీఎం ఇంటర్న్‌షిప్ నమోదు ప్రక్రియ కొనసాగింది. నగరపాలక సంస్థ కమిషనర్ పీనల్లనయ్య ఆదేశాలతో కార్యదర్శులు ఆయా సచివాలయాల పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి పీఎం ఇంటర్నషిప్ కార్యక్రమంలో వివరాలు నమోదు చేశారు. పదో తరగతి నుంచి డిగ్రీ పూర్తి చేసిన 21 నుంచి 24 ఏళ్లలోపు వారి వివరాలను వారి ఆధార్ కార్డు, రైస్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్‌లను నమోదు చేశారు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం

మెరకముడిదాం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మెరకముడిదాం పీహెచ్‌సీలో మంగళవారం సహాయ స్ఫూర్తి ఫౌండేషన్, విజయనగరం అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 69 మందిని పరీక్షించిన వైద్యులు 31 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. వారిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి శస్త్రచికిత్సల నిమిత్తం తరలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అజిత్‌బాబు, రామారావు, వెంకటరమణ ఉన్నారు.

'సూర్యఘర్'కు రిజిస్ట్రేషన్లు

గజపతినగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ సోలార్ ప్యానల్ల ఏర్పాటుకు మంగళవారం పురిటిపెంటలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. సోలార్ సంస్థ ప్రతినిధులు, ఏపీఎం సత్యనారాయణ రూ.వెయ్యి చొప్పున 1200 రిజిస్ట్రేషన్లు చేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, బంగారునాయుడు ఉన్నారు.

బాధ్యతగా పనిచేయండి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ పి.అప్పలరాజుకు సూచించారు. రహదారులు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్‌మన్ ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.గీతాంజలిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సాగర్, ఐకేపీ ఏపీఎం కమలకుమారి, ఏవో శ్రీదేవి పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం తగదు



ఉపాధి పనుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డ్వామా పీడీ

భామిని, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం వహించినా అపరాద రుసుం (రికవరీ) తప్పదని డ్వామా పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ వారీగా తనిఖీ చేసిన డీఆర్‌పీలు చదివి వినిపించారు. 2023-2025 సంవత్సరానికి సంబంధించి 17వ సామాజిక తనిఖీను నిర్వహించారు. రూ.19 కోట్ల నిధులు వినియోగంపై సామాజిక తనిఖీ బృందం తనిఖీలు చేయగా ప్రజావేదికలో ప్రకటించారు. ఈసందర్భంగా లివిరి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ఇప్పటికే సస్పెండ్ ఉండగా, మనుముకొండ ఫీల్డ్ అసిస్టెంట్ నిమ్మల కుమార్‌ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు టి.రాంబాబు, సింహాచలంలకు సస్పెండ్ చేయాలని డ్వామా పీడీ ఆదేశించారు. ఏడాది పాటు లివిరి గ్రామంలో జరిగే పనుల్లో అక్రమాలపై దర్యాప్తు చేయాలని ఏపీవో కె.శ్రీనివాసరావును ఆదేశించారు. అలాగే ప్రతి పంచాయతీలో ప్లాంటేషన్, నేమ్ బోర్డులు, మస్తర్లలో వేతనదారుల సంతకాలు లేకుండానే వేతనాలు చెల్లింపుపై ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీతో పాటు సిబ్బందికి డీటీఎఫ్ ఫైల్‌లో రికవరీ చేయాలన్నారు. ఏపీడీ శ్రీహరి, ఎంపీడీవో కె.సత్యం, ఏపీవో తులసీదాస్, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్ దాస్‌తో పాటు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే లిఫ్ట్ ఇరిగేషన్ సాధ్యం

భామిని, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ఐకమత్యంతో కృషి చేస్తే లిఫ్ట్ ఇరిగేషన్ సాధ్యమవుతుందని పార్వతీపురం లిఫ్ట్ ఇరిగేషన్ ఈఈ త్రిమూర్తి తెలిపారు. మంగళవారం బత్తిలి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి బత్తిలి, వడ్డంగి, లోహరజోల, నులకజోడు, బిల్లుమడ గ్రామాల నుంచి రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పసుకుడి రైతు డి.అప్పలనాయుడు వివరించారు. గత ప్రభుత్వంలో మనుమకొండ లిఫ్ట్ ఇరిగేషన్‌కు 18 కోట్లు, వడ్డంగి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.32కోట్లు మంజూరయ్యాయని, ఆ పనులు చేయకపోవ డంతో రైతులు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారని ఈఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈఈ త్రిమూర్తి స్పందిస్తూ ప్రస్తుతం తన చేతిలో ఏమీ లేదని, గతంలో మనుమకొండ లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు అయ్యేక లైనింగ్ వర్క్ మొత్తం చేపట్టామని, హఠాత్తుగా ధరలు పెరగడంతో కాంట్రాక్టర్ పనులు చేయలమేని చేతులెత్తేశారని, వారిపై కోర్టులో కూడా కేసు నడుస్తుందని వివరించారు. వడ్డంగి ఎత్తిపోతల పథకానికి ప్రతిపాదనలు ఇచ్చినా మంజూరు కాలేదని రైతులకు తెలియజేశారు. రైతు సంఘ నాయకులు బుడితి అప్పలనాయుడు, కేవీ రాంప్రసాద్, శేషగిరి, బి.ప్రభాకర్, నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

సీతానగరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని పశు సంవర్థక శాఖ ఏడీ డా.సీహెచ్ దీనకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పశు వైద్య కార్యాలయంలో మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు అధ్యక్షతన రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. దూడ దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశు వైద్యుడు చక్రధర్ మాట్లాడుతూ 92 పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 50 లేగ దూడలకు నులి పురుగుల మందు వేశామని చెప్పారు. సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్, మాజీ సర్పంచ్ బుడితి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాల్సిందే..

సీతంపేట రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు అందజేస్తున్న భోజనంలో మెనూ తూచా తప్పకుండా పాటించాలని ఐటీడీఏ డీడీ అన్నదొర ఆదేశించారు. మంగళవారం స్థానిక కేజీబీవీని ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ పాటించకుండా అరకొర వంటకాలతో మమ అనిపించినట్టు గుర్తించారు. వంటకాలు కూడా రుచిగా లేనట్లు నిర్ధారించారు. తనిఖీ సమయంలో కేజీబీవీ ప్రిన్సిపాల్, వార్డెన్‌లు కూడా అందుబాటులో లేరు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, మెనూ పాటించాలని సిబ్బందికి సూచించారు. విద్యా ప్రమాణాల స్థాయిని పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఎంవో కోటిబాబు ఉన్నారు.

ఘనంగా లాలా లజపతిరాయ్ జయంతి

గుమ్మలక్ష్మీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లాలా లజపతిరాయ్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టీవీ శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, సింహాచలం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

వీరఘట్టం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జన్‌మన్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ లబ్ధిదారులకు సూచించారు. కె.ఇచ్ఛాపురం పంచాయతీ గంగంపేట పీవీటీజీ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో బి.వెంకటరమణ, గృహ నిర్మాణ శాఖ ఏఈ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారి పనుల నాణ్యతపై పరిశీలన

సీతంపేట రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రహదారి నిర్మాణ పనులను విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా విభాగం ఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో విజిలెన్స్ సిబ్బంది రహదారి పనుల నాణ్యతను పరిశీలించారు. కడగండి పంచాయతీ పరిధిలో నారాయణగూడ గ్రామానికి నిర్మించిన సీసీ, బీటీ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ మాట్లాడుతూ రహదారి నాణ్యతకు సంబంధించిన పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఈ సత్యనారాయణ, టీడబ్ల్యూ ఈఈ రమాదేవి, డీఈ సింహాచలం, ఏఈ నాగభూషణ్ ఉన్నారు.

కబ్జా కోరల్లో కూడళ్లు

● ఆర్‌అండ్‌బీ స్థలాల్లో అక్రమార్కుల పాగా

● ఇష్టారాజ్యంగా నిర్మాణాలు



పత్తికాయవలస కూడలిలో దుకాణాలు నిర్మిస్తున్న దృశ్యం

చీపురుపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధాన కూడళ్లు కబ్జాకు గురవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని తారురోడ్లకు ఆనుకుని ఉన్న కూడళ్లపై అక్రమార్కులు పాగా వేసేస్తున్నారు. భూముల ధరలు పెరిగిపోవడంతో, చిన్నపాటి స్థలాన్ని కూడా విడిచిపెట్టడం లేదు. పట్టణానికి దూరంగా, మారుమూల ఎవరు చూస్తారులే అన్న ధీమాతో స్థలాలు ఆక్రమించి, ఇష్టారాజ్యంగా దుకాణాలు నిర్మిస్తున్నారు. చీపురుపల్లి-శ్రీకాకుళం రోడ్డులో సుమారు అన్ని కూడళ్లలో ఆక్రమణలు జోరందుకున్నాయి. ప్రధానంగా సంకుపాలెం, కర్లాం, పత్తికాయవలస, పుర్రేయవలస గ్రామాలకు వెళ్లే జంక్షన్ల వద్ద తారురోడ్డుకు ఆనుకుని అక్రమార్కులు రూ.లక్షలు విలువ చేసే స్థలాల్లో దుకాణ సముదాయాలు నిర్మిస్తున్నారు. కబ్జా చేయాలనుకున్న స్థలంలో ముందుగా మట్టి వేసి చదును చేస్తున్నారు. ఆ తర్వాత అక్కడ రాళ్లు, ఇసుక వేసి కొద్ది రోజులు వేచి చూస్తున్నారు. అనంతరం ఆయా స్థలాల్లో పక్కాగా నిర్మాణాలు పూర్తిచేసి, వాటిని అద్దెలకు ఇస్తున్నారు. ఆ కూడళ్లలోని జిరాయితీ స్థలాల జోలికి పోకుండా రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ స్థలాల్లోనే ఈ తతంగమంతా సాగుతోంది. ఇప్పటికే చీపురుపల్లి- గరివిడి రోడ్డులో కూడా రూ.లక్షలు విలువ చేసే రెవెన్యూ స్థలాలను పలువురు ఆక్రమించుకోగా, ఇప్పుడు శ్రీకాకుళం రోడ్డులో కూడా విలువైన ప్రదేశాల్లో కూడా ఈ తరహా ఆక్రమణలకు తెర లేపుతున్నారు. కబ్జాదారుల నుంచి కూడళ్లను కాపాడాలని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రధాన రహదారుల్లో ఆక్రమణలను తొలగించడం సాధ్యం కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. నిర్మాణాలను పరిశీలించి, నిలుపుదల చేయాల్సిందిగా ఆదేశించాం. భవిష్యత్తులో తిరిగి నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటాం.

- మురళీబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ, చీపురుపల్లి

ముఖ్యమంత్రి దృష్టికి బొబ్బిలి సమస్యలు



వన్యప్రాణుల ఫొటోలను చంద్రబాబుకు బహూకరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును నేరుగా కలిసి విన్నవించినట్టు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి, నియోజకవర్గ సమస్యలను తెలియజేశానని చెప్పారు. బొబ్బిలి మండలం శివడవలస, తెర్లాం మండలం లోచర్ల గ్రామాల్లో తోటపల్లి కాలువల నుంచి ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. బాడంగి మండలం గొల్లాది గ్రామంలో వేగావతి నదిపై వంతెన నిర్మాణం చేస్తామని, ఎన్నికల ప్రచార సమయంలో రా.. కదలిరా.. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తు చేశామన్నారు. ఈ సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణా కేంద్రాల్లో తాను తీసిన వన్య ప్రాణుల ఫొటోలను ముఖ్యమంత్రికి బహూకరించారు.

తాగునీటి సమస్యలపై మున్సిపల్ మంత్రికి వినతి

బొబ్బిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు మంజూరు చేసిన సువర్ణముఖి తాగునీటి ప్రాజెక్టుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణను కోరినట్లు బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అమరావతిలో మున్సిపల్ శాఖా మంత్రిని కలిసి, తాగునీటి సమస్యను వివరించానని చెప్పారు. బొబ్బిలి పట్టణంలో జనాభా అవసరాలకు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలను మెరుగు పరచాలని కోరానని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో తాగునీటి అవసరాలకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఏఐబీ సహాయంతో రూ.92.20కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో సీతానగరం సువర్ణముఖి నది నుంచి తాగునీటిని పైపులైన్ల ద్వారా పంపింగ్ చేసి ప్రజలకు సరఫరా చేసేందుకు ప్రణాళికను ప్రారంభించారన్నారు. నిధుల కొరత కారణంగా ఆ పథకం పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయని ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రానున్న వేసవిలో తాగునీటి కొరత లేకుండా ఈ పథకం కింద ప్రాజెక్టు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి.. ఏఐబీ నుంచి గానీ, పట్టణాభివృద్ధి శాఖ నుంచి గానీ ఈ పథకానికి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు.

ఆరు లైన్ల రోడ్డుతో ఇబ్బందులు

● నిర్మాణ కంపెనీ వద్ద గిరిజనుల ఆందోళన



కంపెనీ గేటు ముందు వాహనాలు వెళ్లకుండా అడ్డుకుంటున్న గిరిజనులు

రామభద్రపురం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావివలస సమీపం నుంచి వెళ్తున్న ఆరు లైన్ల రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు మంగళవారం ఈ రోడ్డు పనులు చేస్తున్న హెచ్‌జీ ఇన్‌ఫ్రా కంపెనీ వద్ద బైఠాయించారు. వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ రోడ్డు వల్ల గిరిజన గ్రామాల అనుసంధానం దెబ్బతింటుందని తెలిపారు. జీలికవలస నుంచి జమ్మువలస పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఈ హైవే వల్ల రహదారి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. రైతుల భూముల నుంచి మట్టి తీసుకుని వెళ్లి, గుంతలు కప్పకపోవడంతో ప్రమాదకరంగా మారాయన్నారు. పెదశలగాంకు వెళ్లే రహదారి పూర్తిగా మూసుకుపోయిందన్నారు. అలాగే ఎనుబరువు సమీపంలో చాలీచాలని బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో వాహనాలు రాలేని పరిస్థితి నెలకొందని, దీనివల్ల జీసీసీ సరుకులు తీసుకు వెళ్లే వ్యాను, ఇతర వాహనాలు వెళ్లలేవని, దీనిని తక్షణమే మూసివేసి పెద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. గిరిజనుల అమాయకత్వం చూసుకుని కంపెనీ ప్రతినిధులు సస్యశ్యామలంగా ఉన్న తమ గ్రామాలను ధూళి, దుమ్ముతో నింపేశారని రావివలస మాజీ సర్పంచ్ అడారి జైరావు, చర్చి పాస్టర్ ప్రసాద్ ఆరోపించారు. సమస్యలను పరిష్కరిస్తేగానీ కంపెనీ ముఖద్వారం నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దీనిపై కంపెనీ సీనియర్ మేనేజర్ అంబళ్ల రవికుమార్ మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న సమస్యలను 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పాఠశాల మరమ్మతులకు సీఎస్‌ఆర్ నిధులు విడుదల చేశామని తెలిపారు. 15 రోజుల్లో ఈ సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గిరిజనులు హెచ్చరించారు.

గృహాలకు 1,275 దరఖాస్తులు

గరుగుబిల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా గృహాల కోసం 1,275 దరఖాస్తులు వచ్చాయని మండల గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వంగపండు అఖిల్‌నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పీఎంఏవై ఇళ్ల మంజూరుకు సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చిన 1,275 దరఖాస్తులను పరిశీలించామని చెప్పారు. గ్రామ పంచాయతీలో అర్హులైన వారికి ఇళ్లు మంజూరుకు కేంద్ర, పట్టణ వ్యవహారాలు, గృహ నిర్మాణ విభాగం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మండల గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ మరిశర్ల భాస్కరరావు ఉన్నారు.

టీడీపీలో వైసీపీ కౌన్సిలర్ చేరిక



రాజేశ్వరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అచ్చెన్న

పాలకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా పాలకొండ రెండో వార్డు వైసీపీ కౌన్సిలర్ ఆకుల రాజేశ్వరి మంగళవారం టీడీపీలో చేరారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, టీడీపీ పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. కౌన్సిలర్‌తో పాటు ప్రతినిధి ఆకుల కుమార్, 17వ వార్డు కౌన్సిలర్ గుమ్మడి సింహాద్రి, మాజీ కోటదుర్గమ్మ ఛైర్మన్ శాసపు సర్వారావు, పాలకొండ మండలం పొట్లి గ్రామ మాజీ సర్పంచ్ కర్నేన గణేష్ తదితరులు ఉన్నారు.

ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా నైపుణ్య కార్యక్రమాలు

పార్వతీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారికంగా రెండు నైపుణ్య కార్యక్రమాలను ప్రారంభించనున్నట్టు జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్ఎస్‌డీసీ డిజిటల్ భవిష్యత్తు కోసం అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులకు సాధికారిత కల్పించేందుకు ఈ కార్యక్రమాలు ప్రారంభించిందని చెప్పారు. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ ఒకటన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమం కోసం ఈనెల 30వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9988853335, 7036388297 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పారా అథ్లెట్ లలితకు సత్కారం



లలితను సత్కరిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోవముట ప్రాంతం గుల్లలంక గిరిజన గ్రామానికి చెందిన కిల్లక లలిత చైనా దేశంలో హ్యాంగ్జౌ నగరంలో ఇటీవల జరిగిన పారా అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించింది. అలాగే బెంగళూరులో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం సాధించింది. ఈ ఏడాది మొరాకో దేశంలో జరిగిన పోటీల్లో ఐదో స్థానంలో నిలిచింది. అయితే మంగళవారం ఆమె పాలకొండ డివిజన్ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వ్యక్తిగత పని నిమిత్తం వెళ్లింది. విషయం తెలుసుకున్న మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు.. ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యుల ఆధ్వర్యంలో లలితను సత్కరించారు.

స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

● ఏజేఏసీ నాయకుల డిమాండ్

సీతంపేట రూరల్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా నిర్వహించిన పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో ఏపీ శాసనసభ స్పీకర్ 1/70 చట్టంపై సడలింపులు ఇవ్వాలని చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీతంపేట ఏజేఏసీ కమిటీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకర్లతో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో అరకులో ముఖ్యమంత్రి చంద్రబాబు, పాలకొండ వేదికగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌లు జీవో నెంబర్ 3పై సవరణ చేసి గిరిజనులకు న్యాయం చేస్తామని భరోసా కల్పించిన మాటలు నేటికి ఆదివాసీలకు కలలుగానే మిగిలిపోయాయని అన్నారు. కానీ ఒక స్పీకర్ స్థాయిలో ఉండి రాజకీయాల్లో అపార అనుభవం కలిగి, గిరిజన చట్టాల ను కాపాడాల్సింది పోయి కాలరాసే ప్రయత్నం చేయడం యావత్ గిరిజన సమాజం జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. గిరిజన చట్టాల పై స్పీకర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోకపోతే రాష్ట్రంలో ఉన్న గిరిజనులమంతా ఏకమై అనేక ఉద్యమాలకు శ్రీకారం చుడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏజేఏసీ కార్యదర్శులు నిమ్మక కాంతారావు, కె.భాస్కరరావు, బి.ఉమామహేశ్వరరావు, బి.రామ్మోహనరావు, తిరుమలరావు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకమ్మ చెరువు కబ్జాపై ఫిర్యాదు

పార్వతీపురం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ప్రాంతంలో వెంకమ్మ చెరువు కబ్జాకు గురవుతుందని, తగు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పార్వతీపురం తహసీల్దార్ జయలక్ష్మీకి ఫిర్యాదు చేశారు. చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని వారు కోరారు.

9న ప్రజ్ఞా వికాస పరీక్ష

బొబ్బిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 9న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞావికాస పరీక్షను నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు వి.చినబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం బొబ్బిలిలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి కింద రూ.5వేలు, వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3వేలు, రూ.2వేలు ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఫిబ్రవరి1లోగా రూ.30 ప్రవేశరుసుం చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. హాల్‌టికెట్లు కూడా పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9502507945, 7386329165 నెంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్, మణికుమార్ పాల్గొన్నారు.

పన్ను బకాయిలపై ఆరా

బొబ్బిలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపల్ కుమ్మరి వీధి సచివాలయం పరిధిలో గల పలు వీధుల్లో కమిషనర్ లాలం రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. ఈసందర్భంగా పలు అసెస్మెంట్లను స్వయంగా పరిశీలించారు. ఆస్తిపన్ను, కొళాయి పన్నుల బకాయిలపై ఆరా తీశారు. పన్నుల వసూలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదీ లేనిదీ ఆమె తనిఖీ చేశారు. మార్చి లోగా అన్ని రకాల పన్ను బకాయిల వసూళ్ల లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ అధికారులను, సచివాలయ సిబ్బందిని కమీషనరు ఆదేశించారు. ఆమె వెంట సచివాలయం నోడల్ అధికారి సింహాచలం, సచివాలయం ఇన్‌చార్జి తిరునాథ్, ఆర్వో నాగరాజు, ఆర్ఐ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా ముత్యాలమ్మ పండగ



అమ్మవారి ఘటాన్ని మోస్తున్న మంత్రి సంధ్యారాణి

మక్కువ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కవిరిపల్లి గ్రామంలో జన్నివారి ఇంట ఇలవేల్పు ముత్యాలమ్మతల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వగ్రామం కావడంతో వారి ఇంట ఇలవేల్పు అయిన ముత్యాలమ్మవారి ఘటాలను ఆమె స్వయంగా మోశారు. ప్రజలందరినీ సుఖ సంతోషాలతో చల్లగా చూడాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యులతో మొక్కులు చెల్లించుకున్నారు. కవిరిపల్లి, తోటవలస, ఎస్ఆర్‌పురం, మక్కువ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

పాలకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఇందన శకటాల కార్యాలయం ఆవరణలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.వేణుగోపాల్, అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించ వద్దని సూచించారు.

ఆర్టీసీ ఎండీని కలిసిన నాయకులు

పాలకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు మంగళవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించారు. ఈ మేరకు ఆర్టీసీ జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. ఎండీని కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష కార్యదర్శి త్రినాథ, కోశాధికారి దశరథ, లలితకుమారి తదితరులు ఉన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా టంకాల

పాలకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నుంచి తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా టంకాల దుర్గారావు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో తూర్పు కాపు సంఘం రాష్ట్ర ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి ఆధ్వర్యంలో ఈయన ప్రమాణ స్వీకారం చేశారు.

ఇసుక లారీల పట్టివేత

పాలకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి మంగళవారం పట్టుకున్నారు. సీతంపేట నుంచి పాలకొండ సబ్ కలెక్టర్ కార్యాలయానికి వస్తున్న ఆయన.. ఈ లారీలను గుర్తించి, సిబ్బంది సహాయంతో అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ పి.బాలమురళీకృష్ణ అక్కడ చేరుకుని వారి పత్రాలను పరిశీలించారు. కొత్తూరు నుంచి వేరే ప్రాంతానికి ఇసుక వెళుతున్నట్టు గుర్తించారు.